సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం, 18, జూన్, 2024



నేడు గిరి ప్రదక్షిణ

యాదాద్రి ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మంగళవారం 5 వేల మందితో గిరి ప్రదక్షిణ చేయనున్నారు. - 8లో



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36°/ 25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయితేనే అవకాశం

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఒకే చోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్ల నుంచి బదిలీల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. గత సెప్టెంబర్ నాటికి ఒకే చోట ఎనిమిది సంవత్సరాల పూర్తి చేసుకున్న వారు ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా పలు కారణాలతో అప్పట్లో ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా జూన్ 1వ తేదీ నాటికి ఒకే పాఠశాలల్లో ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తయిన వారికి విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అనంతరం స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకోసం సీనియార్టీ జాబితా ప్రకటించనున్నారు.

20న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

భువనగిరి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20న వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి మాత్రలు వేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,57,496 మంది చిన్నారులను గుర్తించారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అర్హులకు మాత్రలు వేయనున్నారు. మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కూడా ఇచ్చారు.

చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి



నల్లగొండలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమార్

నల్లగొండ టౌన్ : చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, వస్త్ర నిల్వలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం శాంతికుమార్, గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సంఘం నల్లగొండ జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ఉపాధి పొందుతున్న చేనేత రంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బడ్జెట్‌లో సహకార సంఘాలకు నిధులు కేటాయించి సంఘాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దండంపల్లి సత్తయ్య, రాపోలు రాములు, రాపోలు వెంకన్న, కర్నాటి శ్రీరంగం, గడ్డం దశరథ, వలిగొండ మధు, బొల్లు రవీంద్రకుమార్, శివ పాల్గొన్నారు.

20 నుంచి బ్రహ్మోత్సవాలు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈఓ మోహన బాబు తెలిపారు. 22 శనివారం రాత్రి శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు కల్యాణం జరుగుతుందని తెలిపారు. మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్





బక్రీద్ సందర్భంగా సోమవారం భువనగిరిలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, చిన్నారులతో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నృసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సోమవారం లక్ష పుష్పార్చన పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలోని శ్రీస్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల లక్ష పుష్పాలతో వేదమంత్రాలు, సన్నాయిమేళం మధ్య వేద పండితులు అర్చన చేశారు. అలాగే ప్రధానాలయంలో వేకువజామున సుప్రభాతం, అభిషేకం, సహస్రనామార్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనం, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. ఇక శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించారు.



లక్ష పుష్పార్చన పూజ చేస్తున్న అర్చకుడు

భూముల విలువ సవరణ

ఏ ప్రాంతంలో ఎంత ధర పెంచాలో కసరత్తు

- అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్న అధికారులు
- సవరించిన విలువల ప్రకారం ఆగస్టు 1నుంచి రిజిస్ట్రేషన్లు
- ప్రస్తుతం అత్యధికంగా రాయగిరిలో ఎకరం రూ.1.56 కోట్లు
- పెరగనున్న రేట్లపై జోరుగా చర్చ



వైటీడీఏ పరిధిలో ప్రస్తుత ధరలు (రూ.కోట్లలో)

గ్రామం	ఎకరం
రాయగిరి	రూ. 1.56 (అత్యధికం)
మల్లాపూర్	రూ.4 లక్షలు (అత్యల్పం)
హెచ్‌ఎండీఏ పరిధిలో..	
దేశ్‌ముఖ్	రూ.1.16కోట్లు
అల్లాపూర్	రూ.5 లక్షలు
మండలాల్లో..	
ఆలేరు	రూ.54.21 లక్షలు
సోమారం	రూ.1.50 లక్షలు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో భూముల విలువలు మారోమారు పెరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, కమర్షియల్ భూముల విలువలపై అధ్యయనం చేసేందుకు అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ల్యాండ్ సర్వే అధికారులతో పలు దఫాలు సమావేశం కానున్నారు. ఏయే ప్రాంతాల్లో ధరలు ఎంత పెంచాలనే దానిపై అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అదజేయనున్నారు. సవరించిన భూముల విలువ ఆధారంగా ఆగస్టు 1నుంచి రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంది.

ప్రస్తుత రేట్లపై ఆరా తీస్తున్న అధికారులు

జిల్లాలోని వైటీడీఏ (యాదగిరిపల్లి, గుండ్లపల్లి, సైదాపురం, మల్లాపురం, రాయగిరి, దాతరుపల్లి), హెచ్‌ఎండీఏ (భువనగిరి, బొమ్మలరామారం, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మండలాలు) పరిధితో పాటు మిగతా మండలాలు, మున్సిపాలిటీల్లో భూముల విలువలు సవరించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు ఏ విధంగా ఉన్నాయని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. వైటీడీఏ, హెచ్‌ఎండీఏ పరిధిలో, హైదరాబాద్ - విజయవాడ, హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో భూముల ధరలు రూ.కోట్లల్లో ఉన్నాయి. కొత్తగా సంగారెడ్డి - చౌటుప్పల్, గౌరెల్లి - భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారులు నిర్మితం అవుతున్నాయి. వీటి వెంట కూడా ధరలు విపరీతంగా పెరిగాయి. వీటితో పాటు భువనగిరి- చిట్యాల, రాయగిరి - మోత్కూరు. చౌటుప్పల్ - మునుగోడు రహదారుల వెంట, చౌటుప్పల్, బీబీనగర్, కొండమడుగు, భువనగిరి పారిశ్రామిక వాడల్లో భూముల విలువ అధికంగా ఉంది. తాజాగా సవరించనున్న నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

అత్యధికంగా, అత్యల్పంగా ఈ ప్రాంతాల్లో..

రిజిస్ట్రేషన్ ప్రకారం అత్యధికంగా వైటీడీఏ పరిధిలో ఉన్న భువనగిరి శివారులోని రాయగిరిలో ఎకరం రూ.1.56 కోట్లు పలుకుతోంది. అత్యల్పంగా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్‌లో ఎకరం రూ.4లక్షలు ఉంది. హెచ్‌ఎండీఏలో పరిధిలో అత్యధికంగా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్‌లో ఎకరం రూ.1.16 కోట్లు, అత్యల్పంగా చౌటుప్పల్ మండలం అల్లాపూర్‌లో ఎకరం రూ.5లక్షలు పలుకుతోంది. మిగతా మండలాల్లో అత్యధికంగా ఆలేరులో, అత్యల్పంగా రాజాపేట మండలం సోమారం గ్రామంలో ఉంది.

పదేళ్ల ముందుకు ధరలు

నూతన జిల్లా ఏర్పాటుతో జిల్లాలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. దీనికి తోడు భూముల మార్కెట్ విలువలు ఇప్పటికే రెండుసార్లు పెరిగాయి. దీంతో రానున్న పది సంవత్సరాల తర్వాత ఉండాల్సిన ధరలు ఇప్పుడే ఉన్నాయి. మరోసారి భూముల విలువలు భారీగా పెరిగే అవకాశం ఉండడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్లాట్ కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని వారు వాపోతున్నారు. భువనగిరి పట్టణంలో రిజిస్ట్రేషన్ ఫీజు ప్రకారం గజరం రూ.36 వేలు ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో రూ. లక్షకు పైగా పలుకుతోంది.

నల్లగొండ, సూర్యాపేట ఎస్పీలు బదిలీ

- నూతన ఎస్పీలుగా శరత్ చంద్రపవార్, సన్‌ప్రీత్‌సింగ్

నల్లగొండ క్రైం, సూర్యాపేట టౌన్ : నల్లగొండ జిల్లా నూతన ఎస్పీగా శరత్‌చంద్ర పవార్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు జిల్లాలో బాధ్యతలు నిర్వహించిన చందనాదీప్తిని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా బదిలీ చేసింది. ఎస్పీ శరత్‌చంద్రపవార్ గతంలో గోదావరిఖని ఓఎస్‌డీగా, మహబూబాబాద్ ఎస్పీగా, హైదరాబాద్ సెంట్రల్‌జోన్ డీసీపీగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం యాంటీ నార్కోటిక్స్ బ్యూరోలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన.. నల్లగొండ ఎస్పీగా బదిలీపై వస్తున్నారు. అదే విధంగా సూర్యాపేట నూతన ఎస్పీగా సన్‌ప్రీత్‌సింగ్ నియామతులయ్యారు. ప్రస్తుతం సూర్యాపేట ఎస్పీగా పని చేసిన రాహుల్‌హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయ్యారు.

సమాజానికి మార్గ నిర్దేశకులు కవులు



మమతల పందిరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, కళాకారులు

- డాక్టర్ నందిని సిధారెడ్డి

మోత్కూరు : కవులు సమాజానికి మార్గ నిర్దేశకులని, వారితో ఎంతో మేలు జరుగుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి తెలిపారు. మోత్కూరు ప్రజాభారతి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ మాజీ కార్యదర్శి, కవయిత్రి మర్రి జయశ్రీ రచించిన మమతల పందిరి పుస్తకాన్ని సోమవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషను భావితరాలకు అందజేయడానికి కవులు కృషి చేయాలని కోరారు. కవులు, కళాకారులు, గాయకులు, ఉద్యమకారులకు మోత్కూరు పుట్టినిల్లన్నారు. మోత్కూరుకు తనకు పేగు బంధం, సాహిత్య బంధం అని చెప్పారు. మమతల పందిరి పుస్తకాన్ని అందించిన జయశ్రీ అభినందనీయురాలని కొనియాడారు. సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు అనేక ఘట్టాల్లో మోత్కూరు ముందు నిలిచిందన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య గ్రంథ సమీక్ష చేశారు. ప్రజా భారతి అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ దామల రాంప్రసాద్, కులీకుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మీసాల సైదులు, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి బండారు జయశ్రీ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు మర్రి ఆనందం, కేరళ నాటి అకాడమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోలి రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ బండ్ల రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ మేక శివకుమార్, ఓయూజేఏసీ నాయకులు మర్రి అనిల్, ప్రజాభారతి గౌరవ అధ్యక్షుడు ఎస్.ఎన్.చారి తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తీరే దారేదీ..



ఆలేరు పట్టణంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద వాహనచోదకులు నరకం చూస్తున్నారు. చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతమంతా మడుగులా మారుతోంది. దీని వల్ల స్థానికులే కాకుండా కొలనుపాక, రఘునాథపురం వెళ్లే వారూ ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో దారి కూడా కనిపించడం లేదని వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని, బ్రిడ్జి పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని కోరారు.

- యాదగిరిగుట్ట రూరల్ (ఆలేరు రూరల్)

ఉద్యోగ విరమణ ఉన్నట్టా, లేనట్లా!

- ఏప్రిల్ నెలలోనే 97 మందితో జాబితా సిద్ధం చేసిన అధికారులు
- లోక్‌సభ ఎన్నికలతో నిలిచిపోయిన ప్రక్రియ
- కోడ్ ముగిసినా స్పష్టతనివ్వని ప్రభుత్వం
- అయోమయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు



పదవీ విరణమణ బెనిఫిట్స్ పెంచాలని ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు (ఫైల్)

భువనగిరిటౌన్ : తమ ఉద్యోగ విరమణపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆయోమయంలో ఉన్నారు. 65 సంవత్సరాలు నిండిన 97 మందితో ఏప్రిల్ నెలలోనే అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా పదవీ విరమణ అంశం ప్రస్తావన లేకపోవడంతో.. ఈ నెల నుంచి ఉద్యోగ విరమణ అమలు చేస్తారా, లేదా? అని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ వయస్సును ప్రభుత్వం 65 ఏళ్లుగా నిర్ణయించింది. వీరు ఉద్యోగ విరమణ పొందే సమయంలో ప్రయోజనాలు (బెనిఫిట్స్) కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీచర్‌కు రూ.లక్ష, ఆయాకు రూ.50వేలు సహాయం అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో 65 ఏళ్లు నిండిన వారి వివరాలతో కూడిన జాబితాను అధికారులు ప్రభుత్వానికి అందజేశారు.

ఏప్రిల్ జాబితా ప్రకారం 97 మంది..

జిల్లాలో 65ఏళ్ల వయస్సు నిండిన టీచర్లు 19, ఆయాలు 78 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఉద్యోగ విరమణకు అర్హులుగా గుర్తించారు. ఎన్నికల కోడ్ ముగిసినందున వారి రిటైర్‌మెంట్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మే, జూన్ మాసాల వరకు 65 ఏళ్ల వయస్సు నిండిన వారి వివరాలను కూడా సేకరించాల్సి ఉంటుంది. తద్వారా ఉద్యోగ విరమణకు అర్హత పొందేవారి సంఖ్య పెరగనుంది.

వయసు నిర్ధారణలో తేడా

ఉద్యోగ విరమణకు ప్రస్తుతం 97 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే వయసు నిర్ధారణకు సంబంధించి వారిలో అయోమయం నెలకొంది. బోనాఫైడ్, టీసీ, పదో తరగతి మార్కు మెమో ఇలా.. ఏదో ఒక ధ్రువపత్రం తప్పనిసరిగా సమర్పించాలని అధికారులు సూచించారు. కాగా టీచర్లంతా చదువుకున్న వారు కావడంతో జనన ధ్రువీకరణ, ఇతర వివరాలతో కూడిన సర్టిఫికెట్‌లు సిద్ధం చేసుకున్నారు. సహాయకుల్లో చాలా మందికి సర్టిఫికెట్‌లు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. కొందరికి అవసరమైన సర్టిఫికెట్‌లు ఉన్నప్పటికీ వయసులో తేడాలు ఉన్నాయి. పుట్టిన తేదీ ధ్రువపత్రం లేని వారు వయసు నిర్ధారణ కోసం ఎముకల సాంద్రత పరీక్ష (బోన్ డెనోమెట్రిక్) చేయించుకోవాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాస్థాయి వైద్యాధికారితో ధ్రువపత్రం తీసుకోవాలని సూచించారు. దీనికోసం భువనగిరి ఏరియా ఆస్పత్రి, బీబీనగర్ ఎయిమ్స్‌లో బోన్ డెనోమెట్రిక్ సదుపాయం కల్పించాలని వైద్యాధికారులకు లేఖ రాసినా ఎలాంటి స్పందన రాలేదు.

ప్రభుత్వానికి జాబితా పంపించాం

ప్రభుత్వం ఆదేశాల మేరకు 65 ఏళ్ల వయస్సు నిండిన టీచర్లు, ఆయాల జాబితాను తయారు చేసి ఏప్రిల్‌లోనే అందజేశాం. ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుటాం. రిటైర్‌మెంటపైపై ఇప్పటి వరకు మాకు ఎలాంటి సమాచారం రాలేదు. వస్తే అమలు చేస్తాం.

–కేవీ కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారిణి

బెన్‌ఫిట్స్‌పై అసంతృప్తి

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పదవీ విరమణ అనంతరం ఎలాంటి ఆర్థికసాయం పొందేవారు కాదు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ సమయంలో టీచర్‌కు రూ.5 లక్షలు, ఆయాకు రూ.2 లక్షల సాయం అందజేయాలని గతంలో అనేకమార్లు పోరాటాలు చేశారు. అందుకు గాను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్పందించి టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు లక్ష రూపాయలను ఉద్యోగ విరమణ బెన్‌ఫిట్ కింద ప్రకటించింది. కాంగ్రెస్ సైతం కనీస వేతనం రూ.18వేలతో పాటు పలు హామీలు ఇచ్చింది. కానీ, ఉద్యోగ విరమణ సమయంలో టీచర్‌కు రూ.లక్ష, ఆయాకు రూ.50 వేలే ఇచ్చే అవకాశం ఉండడంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తమవుతోంది. టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష చెల్లించాలని కోరుతున్నారు.

నిధులు లేక.. పనులు సాగక

- యాదగిరిగుట్టలో నిలిచిపోయిన మోడ్రన్ వైకుంఠధామం
- బిల్లులు రాలేదని పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఆఖరు మజిలీకి అవస్థలు



నిలిచిపోయిన మోడ్రన్ వైకుంఠధామం పనులు

యాదగిరిగుట్ట : పట్టణంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మోడ్రన్ వైకుంఠ ధామ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. మొదట్లో పనులు చురుగ్గా సాగినప్పటికీ.. ఆ తరువాత నిధుల కొరత, మరోవైపు బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. వెరసి ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు పట్టణవాసులు అంటున్నారు.

కోటి రూపాయల అంచనా వ్యయంతో..

యాదగిరిగుట్ట పట్టణంలోని 6వ వార్డులో ఉన్న శ్మశానవాటిక స్థలంలో కోటి రూపాయల అంచనా వ్యయంతో మోడ్రన్ వైకుంఠధామ నిర్మాణం చేపట్టారు. 2022 ఏప్రిల్ 6వ తేదీన పనులకు శంకుస్థాపన చేశారు. మరుసటి రోజు నుంచే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ప్రహరీ, బర్నింగ్ ప్లాట్ ఫాం, పూజ స్టోర్, దింపుడుగల్లం ప్లాట్ ఫాం, స్నానపు గదులు, టాయిలెట్లు పూర్తి చేశారు. సుమారు 70 శాతం పనులు పూర్తై ఏడాదిన్నరకు పైగానే అయింది. కాంట్రాక్టర్‌కు పూర్తి స్థాయిలో బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేశాడు.

జరగాల్సిన పనులు ఇవీ..

30 శాతం పనులు జరిగితే వైకుంఠధామం అందుబాటులోకి వస్తుంది. సీసీ రోడ్డు, ఆర్చి గేట్, ఫ్లాట్ ఫాం, ప్లాస్టరింగ్, వాచ్‌మన్ గది, ప్లంబింగ్, పేయింటింగ్, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు మొక్కలు నాటే పనులు పెండింగ్ ఉన్నాయి. నిధులు వస్తే తప్పా.. ఇప్పట్లో పనులు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. అధికారులు చొరవ చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు

బిల్లు రూ.46 లక్షలు రావాలి

యాదగిరిగుట్ట పట్టణంలో నిర్మిస్తున్న మోడ్రన్ వైకుంఠధామానికి సంబంధించి రూ.46 లక్షల బిల్లు రావాలి. రూ.46 లక్షలకు గాను రూ.30 లక్షలకే బిల్లు పెడతామని అధికారులు అంటున్నారు. పనులు అప్పగించిన నాలుగు నెలల్లోనే 70 శాతం పూర్తి చేశాను. బిల్లు రాగానే మిగిలిన పనులు పూర్తి చేస్తాను.

-కె.వినోద్‌కుమార్, కాంట్రాక్టర్

త్వరలో పూర్తి చేయిస్తాం



మోడ్రన్ వైకుంఠధామం పనుల విషయమై ఇప్పటికే పలుమార్లు కాంట్రాక్టర్‌తో మాట్లాడాం. బిల్లులు రాగానే పనులు చేస్తానని చెబుతున్నాడు. వరుస ఎన్నికల రావడంతోనూ సరైన దృష్టి సారించలేకపోయాం. త్వరలోనే పూర్తి చేయించి అందుబాటులో తీసుకువస్తాం.

-అజయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, యాదగిరిగుట్ట

హామీలు అమలు చేయకపోతే ఉద్యమం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

చిట్యాల : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పకుండా అమలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహాయించి మిగతా హామీల అమలుపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ, తులం బంగారంతో కల్యాణలక్ష్మి పథకం, మహిళలకు రూ.2,500 అందజేత, ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా పథకాల అమలుకుగాను పలు సాంకేతిక కారణాలు చూపుతూ జాప్యం చేస్తోందని మండిపడ్డారు. హామీలన్నీ అమలు చేయకపోతే ప్రజా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పార్టీ కార్యకర్తలు కూడా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, శీలా రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

రాజాపేట: రెండు బైకులు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపురం గ్రామానికి చెందిన కుందెళ్ల గణేష్‌కు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సంపత్ (26) ఆదివారం రాత్రి పారుపల్లిలోని తన బాబాయ్ ఇంటి నుంచి స్వగ్రామానికి బైక్ వస్తున్నాడు. అదే సమయంలో కాల్వపల్లి వాగు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

యాదాద్రిలో భక్తురాలికి అస్వస్థత



భక్తురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది. వివరాలు.. సోమవారం ఉదయం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన నిఖిత యాదాద్రీశుడిని దర్శించుకున్న అనంతరం ప్రసాదం కొనుగోలు చేయడానికి వెళ్లింది. అక్కడ క్యూలైన్‌లో నిల్చొని అస్వస్థతకు గురైంది. వెంటనే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బంది గుర్తించి, కొండపైన గల వైద్యాధికారి సహకారంతో అష్టభుజి ప్రాకార మండపంలో ఆమెకు వైద్యం అందించారు. కొద్దిగా కోలుకున్న తర్వాత కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మర్రిగూడ: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మర్రిగూడ చౌరస్తాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీకి చెందిన జావెద్ బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి మర్రిగూడ చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ విగ్రహం దిమ్మెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జావెద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అతడిని మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దేవరకొండ: మండల పరిధిలో గిరిజానగర్ తండా సమీపంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గిరిజానగర్ తండా సమీపంలో గల పాత వాటర్ ప్లాంట్ వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని సోమవారం రాత్రి స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు గత కొన్నిరోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి వయస్సు సుమారు 40సంవత్సరాలు ఉంటుందని, చామనఛాయ రంగులో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

గంజాయి ముఠా అరెస్ట్

- 12 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 6 కిలోల గంజాయి, రూ.46 వేల నగదు, 12 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: గంజాయి విక్రయిస్తూ యువతను పెడదారి పట్టిస్తున్న ముఠాను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మిర్యాలగూడలోని తన కార్యాలయంలో డీఎస్పీ కె. రాజశేఖరరాజు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రానికి చెందిన సాకేటి తిరుపతి నారం నాయుడు అలియాస్ దాదు, సాకేటి పాలినాయుడు కొద్దిరోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో బాబ్జి అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి బస్సులు, రైళ్ల ద్వారా దాచేపల్లికి తీసుకొచ్చి అక్కడి నుంచి తెలంగాణలోని దామరచర్ల, మిర్యాలగూడ పట్టణానికి తెచ్చి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ కొందరు యువకులకు గంజాయి అలవాటు చేసి తర్వాత వారినే పెడ్లర్లుగా మార్చుకుని వారి ద్వారా చిన్నచిన్న ప్యాకెట్లలో గంజాయి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ శివారులోని రైల్వే అండర్‌పాస్ వద్ద గంజాయి విక్రయాలు సాగుతున్నాయనే విశ్వసనీయ సమాచారంతో సోమవారం అక్కడికి చేరుకున్న దామరచర్ల, వాడపల్లి పోలీసులు తిరుపతి నారం నాయుడు, పాలినాయుడుతో పాటు అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన కొంగ ప్రకాశ్, పాలకీడు మండలం శూన్యంపహాడ్‌కు చెందిన నందిపాటి నవీన్, దామరచర్ల మండల కేంద్రానికి చెందిన సిగపట్ల మహేష్, దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన కలిమెల కిశోర్, వీరభద్రపురానికి చెందిన తరుక రమేష్, మిర్యాలగూడ పట్టణం శాబునగర్‌కు చెందిన సంగోజు కార్తీక్, షేక్ ఖాజా, రెడ్డి కాలనీకి చెందిన జగతి కుమార్, ఈదులగూడెం కాలనీకి చెందిన జగతి కోటేష్, శాంతినగర్‌కు ముడావత్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 6కిలోల గంజాయితో పాటు, రూ.46వేల నగదు, 3 బైక్‌లు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబుతో పాటు ఎస్‌ఐలను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు సుధాకర్, నాగార్జున, వీరబాబు, ఎస్‌ఐలు రవి, శోభన్‌బాబు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దర్వేశిపురం బ్రహ్మోత్సవాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

- చివరిరోజు బోనాలు సమర్పించిన మహిళలు



బోనాలు సమర్పించేందుకు ఆలయానికి వస్తున్న మహిళలు, భక్తులు

కనగల్: మండలంలోని దర్వేశిపురం(పర్వతగిరి)లో గల రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఉదయం సోమవారం 8గంటలకు ఆలయం వద్ద 108 కలశాలతో అష్టోత్తర శతఘటాభిషేకం కార్యక్రమంతో పాటు మహాపూర్ణాహుతి, త్రిశూల స్నానం, నీరాజన మంత్రపుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు పర్వతగిరి, దర్వేశిపురం, మంచినీళ్లబావి, ఎల్లమ్మగూడెం, కుమ్మరిగూడెం గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో వచ్చి పరశురాముడి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మహిళల కోలాట ప్రదర్శన, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ జల్లేపల్లి జయరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ చనగాని నాగేష్‌గౌడ్, అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రావణకుమారాచార్యులు, గాదె మహేష్, దామోదర్‌రావు, ఫణి, శ్రీను, నాగరాజు, ఆలయ సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, లింగస్వామి, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, అంజనేయులు, యాదగిరి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసినట్లు ఆలయ ఈఓ జయరామయ్య తెలిపారు. ఉత్సవాలకు హాజరైన రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిదంపతులు, భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు బెల్లి నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి నర్సింహ తన కుటుంబ సభ్యులతో కలిసి డాబాపై నిద్రించాడు. ఆదివారం ఉదయం కిందికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో పాటు తలుపులు తెరుచుకొని ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా తులంన్నర బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఎన్. శ్రీను తెలిపారు.

ప్రొక్లెయిన్‌కు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మఠంపల్లి: ప్రొక్లెయిన్‌కు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని అవిరేణికుంటతండా సమీపంలో సోమవారం జరిగింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం తాళ్లపాడు గ్రామానికి చెందిన తన్నీరు శివన్నారాయణ(30) మఠంపల్లి మండలం అవిరేణికుంటతండా సమీపంలో టాటా హిటాచీ(ప్రొక్లెయిన్) ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తను పనిచేస్తున్న ప్రొక్లెయిన్‌కు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మఠంపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబ సమస్యల కారణంగానే శివన్నారాయణ ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి తల్లి తన్నీరు రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

వాహనాల బ్యాటరీలు చోరీ

మాడుగులపల్లి: మండల కేంద్రంతో పాటు ఇందుగుల గ్రామంలో పలు వాహనాల బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి అపహరించారు. రెండు గ్రామాల్లో ఐదు ట్రాక్టర్లు, ఓ ఆటో, డీసీఎంకు చెందిన బ్యాటరీలను దుండగులు చోరీ చేశారు. వాహనాలు ఆరుబయట నిలిపి ఉండడంతో అదునుగా భావించి దుండగులు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ చోరీల వెనుక ఒకే ముఠా హస్తం ఉందా? లేక జల్సాలకు అలవాటు పడిన స్థానిక ఆకతాయిలు ఎవరైనా చేశారా? తేలాల్సి ఉంది. చోరీల విషయం తమ దృష్టికి రాలేదని పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు: మండలంలోని తేనపల్లి గ్రామంలో సోమవారం పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ బి. శివ ప్రసాద్ తెలిపారు. నర్సింహులు గూడెం గ్రామానికి చెందిన తాళ్ల శేఖర్ అనే వ్యక్తి తేనపల్లి గ్రామానికి చెందిన యాదయ్య అనే వ్యక్తి సహాయంతో అక్రమంగా 9.5క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోమాతను అసభ్యంగా చిత్రీకరించారని ఫిర్యాదు

- కేసు నమోదు చేసిన భువనగిరి పోలీసులు
- పొరపాటుకు క్షమాపణ కోరిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి క్రైం : బక్రీద్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపే పోస్టర్‌పై గోమాతను అసభ్యంగా చిత్రీకరించారని హిందూ సంఘాల ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోమాతను చిత్రీకరించడంతో హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, దానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు కానుకుంట్ల రమేష్, రత్నపురం బల్‌రాం, మంగు నర్సింహరావు, సుర్వి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. హిందూ సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

క్షమాపణ కోరిన ఎమ్మెల్యే..

బక్రీద్ సందర్భంగా ముద్రించిన పోస్టర్‌లో జరిగిన పొరపాటుకు బాధ్యత వహిస్తూ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోషల్ మీడియా ద్వారా క్షమాపణ కోరారు. 'ఈ పోస్టర్ వలన ఎవరి మనసు బాధపడ్డా నన్ను క్షమించాలి' అని ఎమ్మెల్యే తెలిపారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి

మునగాల(కోదాడ): మునగాల మండలంలోని కృష్ణానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతిచెందాయి. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్ గ్రామవాసులైన భుక్యా శంకర్, గుగులోతు వెంకటేశ్వర్లుకు చెందిన నాలుగు గేదెలు ఆదివారం గ్రామ శివారులో మేతకు వెళ్లగా.. అదే సమయంలో విద్యుత్ తీగలు తెగిపడడంతో వాటిని గేదెలు తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. గేదెల యజమానులు సోమవారం గేదెల కోసం వెతుకుతుండగా గ్రామ శివారులో తెగిపడిన విద్యుత్ తీగల కింద మృతిచెందిన గేదెలను గుర్తించారు. సుమారు రూ.రెండు లక్షల విలువైన గేదెలు మృతిచెందడంతో పాలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులు జీవనాధారం కోల్పోయారు. తమకు జరిగిన నష్టాన్ని గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా

మోతె: మండలంలోని మామిళ్లగూడెం-తుమ్మలపల్లి మధ్య ఆదివారం రాత్రి ఇసుక ట్రాక్టర్ ఢీకొని మృతిచెందిన తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మంద ఉపేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, తుమ్మలపల్లి గ్రామస్తులు మోతె పోలీస్ ఎదుట సోమవారం సాయంత్రం మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. దీంతో సూర్యాపేట-ఖమ్మం 365బీబీ జాతీయ రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్న ఉపేందర్ మృతి చెందడం వలన అతడి కుటుంబం రోడ్డున పడిందని, వారి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు, బంధువులు డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో పెద్దమనుషుల సమక్షంలో చర్చలు జరపగా.. నష్టపరిహారం చెల్లించేందుకు ట్రాక్టర్ యజమాని ఒప్పుకోకపోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. సూర్యాపేట డీఎస్పీ రవి అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, నడిగూడెం, మునగాల, మోతె ఎస్‌ఐలు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతుడి బంధువులు

ఉపాధి కూలీగా మారిన ఐఆర్ఎస్ అధికారి



ఉపాధి పనులు చేస్తున్న ఐఆర్ఎస్ అధికారి సందీప్ బాగా

నూతనకల్: కూలీల స్థితిగతులను అంచనా వేయడం కోసం ఐఆర్ఎస్ అధికారి ఉపాధి కూలీగా మారాడు. వివరాలు.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన సందీప్ బాగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సౌత్ సెంట్రల్ ట్యాక్స్ కమిషనరేట్‌లో జీఎస్టీ ఇన్వెస్టిగేషన్ వింగ్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఆయన సోమవారం నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి చెరువు పూడికతీత పనుల్లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం చేపట్టిన స్వయం ఉపాధి కార్యక్రమాలను వారికి వివరించడంతో పాటు వివిధ వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఆయన కూలీలతో కలిసి భోజనం చేయడంతో పాటు బతుకమ్మ పాటకు నృత్యం చేశారు. తనతో పాటు పనిలో పాల్గొన్న 152మంది కూలీలకు తన జీతం నుంచి రూ.200 చొప్పున అందజేశారు.

తిరుమల శ్రీవారి సేవలో మంత్రి ఉత్తమ్ దంపతులు



తిరుమలలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి దంపతులు

హుజూర్‌నగర్: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సోమవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా వారు కుటుంబ సమేతంగా తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని, తిరుపతిలోని పద్మావతి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం అక్కడ నుంచి బయల్దేరి శ్రీకాళహస్తిలో గల వాయులింగేశ్వర సహిత జ్ఞాన ప్రసూనాంబికా దేవి ఆలయాన్ని, దక్షిణామూర్తిని, పలు ఆలయాలను వారు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట కుంటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

నేడు యాదాద్రిలో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేసే రోడ్డు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం 5వేల మందితో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ ఈఓ భాస్కర్‌రావు వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 5గంటలకు వైకుంఠద్వారం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమై.. తిరిగి అక్కడే ముగియనుంది. అరుణాచలం, సింహాచలం ఆలయాల్లో మాదిరిగానే యాదాద్రి ఆలయంలో కూడా గిరి ప్రదక్షిణ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. దీనికి సంబంధించి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ప్రతి స్వాతి నక్షత్రం రోజు వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొనేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆలయాధికారులు పేర్కొన్నారు.

యాదాద్రిలో ఎంపీ బలరాంనాయక్ పూజలు



ఎంపీ బలరాంనాయక్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఎంపీకి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణం, ఇటీవల జరిగిన అభివృద్ధి గురించి ఎంపీకి ఈఓ వివరించారు.

అందరికీ అందుబాటులో 'స్వర్ణగిరి' ఆర్జిత సేవలు

- ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు



మాట్లాడుతున్న మానేపల్లి రామారావు

భువనగిరి: భువనగిరిలో కొలువైన స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్జిత సేవలు భక్తులందరికీ అందుబాటులో ఉంటాయని ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు అన్నారు. సోమవారం ఆలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 5గంటలకు ప్రారంభమయ్యే సుప్రభాత సేవ మొదలు ఏకాంత సేవ వరకు మొత్తం 16 ఆర్జిత సేవలను టీటీటీ. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఛౌరు వెబ్‌సైట్‌లో బుక్ చేసుకున్న వారికి లభించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మాత్రమే విరామం ఉంటుందని పేర్కొన్నారు. శని, ఆదివారాలలో మాత్రమే ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు స్వామి వారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆలయం సమీపంలోనే గోశాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి మురళీకృష్ణ, గోపికృష్ణ మాట్లాడుతూ.. 2వేలతో ప్రారంభమైన నిత్యఅన్నదానం కార్యక్రమం నేడు ప్రతిరోజు సుమారు 8వేల మందికి అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో స్వామివారి దర్శనం ప్రారంభమై వంద రోజులు అవుతుందని ఇప్పటి వరకు సుమారు 46లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. భక్తులు క్యూలైన్‌లో ఉండాల్సిన అవసరం లేకుండా ఆలయ వెబ్‌సైట్ ద్వారా టికెట్ బుక్ చేసుకుని దర్శనం చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు సుమారు 50 నుంచి 70వేల మంది భక్తులు ఆలయానికి వస్తున్నారని అన్నారు. ఆలయానికి ట్రస్టుల ద్వారా రూ.12.49 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. హుండీ ఆదాయం కోశాగారంలోనే ఉందన్నారు. భక్తులకు భద్రతను కల్పించే విషయంలో పోలీసుల సహకారం, సూచనలు తీసుకుంటున్నామని, సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ నుంచి స్వర్ణగిరి వరకు స్వర్ణగిరి నుంచి యాదాద్రి వరకు బస్సు సౌకర్యం ఉందన్నారు. భక్తులకు సేవలందించేందుకు ఆలయంలో సుమారు 450 మంది పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో స్థపతి ప్రసాద్, ఆలయ ప్రధాన పూజారి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు



తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు



తీన్మార్ మల్లన్నకు డైరీ అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నల్లగొండ టౌన్: బీసీ కులాల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వరంగల్-ఖమ్మం-నలగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టాలని నిర్ణయించినందున కుల సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. బీసీలు కలిసికట్టుగా ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ.. బీసీ కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కాసోజు విశ్వనాథం, నల్లా సోమ మల్లయ్య, దేశబోయిన శంకర్ ముదిరాజ్, కాశయ్యగౌడ్, ఎలంరాజు, చిక్కుల్ల రాములు, జిల్లా ఆదినారాయణ, కొల్లోజు సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, తరాల పరమేష్, నల్ల మధు, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

మున్నూరు కాపు సంఘం నల్లగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవల వెంకటనర్సయ్య, ఇంద్రయ్య, కేశవులు, నర్సింహా, అనిల్ కుమార్, వైద్యుల సత్యనారాయణ, సమీర్‌కుమార్, చంద్రయ్య, శ్యాంసుందర్, చంద్రశేఖర్, వీరమల్ల భాస్కర్, వైద్యం రామారావు, వెంకటేశ్వర్లు, ముత్యాల కృష్ణయ్య, రామలింగం, కోటి, శేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

నల్లగొండ టూటౌన్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మల్లన్నకు సంఘం డైరీని అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు నాగవల్లి ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు సిరందాసు రామదాసు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పంకజ్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.